సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



'పొలాల' సందడి

జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పొలాల అమావాస్య సందడి నెలకొంది. ఎద్దుల ప్రతిమలను, గురుగులను చెరువులో నిమజ్జనం చేశారు. 9లో▸



భారతీయ కళలను పరిరక్షించుకోవాలి

9లో▸

ప్రాచీన భారతీయ కళలను పరిరక్షించుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బాలకేంద్రానికి చెందిన చిన్నారులు నృత్య పోటీల్లో పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.5/24.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మతతత్వ రాజకీయాలకు చోటులేదు



మాట్లాడుతున్న అమేర్ అలీఖాన్

కైలాస్‌నగర్: దేశంలో మతతత్వ రాజకీయాలకు చోటులేదని, కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతపరమైన విద్వేశాలకు వెళ్లకుండా ప్రజలంతా కలిసిమెలిసి ఉంటూ, మంచి ఆలోచన దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్తు పూర్తిగా కాంగ్రెస్ పార్టీదేనని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం తనవంతు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. హిందూవులు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు అన్న మతపరమైన విభేదాలకు వెళ్లకుండా పాలు, చక్కెరలా అందరూ ఐక్యతగా మెలగాలని ఆకాంక్షించారు. బీజేపీ విభజించి పాలించు విధానాన్ని అవలంభిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగిసిందని, జూడో యాత్ర మొదలుకాబోతోందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించి విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం పెరగాలన్నదే తన ముఖ్య లక్ష్యమన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల ద్వారా అది సాధ్యం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. నవ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

కైలాస్‌నగర్ : జిల్లాలోని అన్నదాతలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాగులు పొంగి పొర్లుతున్న సమయంలో దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. వర్షం కురుస్తుండగా చెట్లకింద ఉండవద్దన్నారు. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో గేట్లు ఎత్తివేసే అవకాశం ఉందని, వాటి పరీవాహక ప్రాంతాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పును హేళన చేయడం సరికాదు



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సుప్రీంకోర్టు తీర్పును హేళన చేసేలా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని, కవితకు బెయిల్ రావడం పట్ల ములాఖత్ అయ్యాయని ఆరోపించారు. ప్రజల ఆత్మగౌరవం నుంచి పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీని భూస్థాపితం చేసేందుకు ఆ రెండు పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్, బీజేపీకి 8 చొప్పున ఎంపీలు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో మొండిచేయి చూపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిందని, బీజేపీ నాయకులు ఎందుకు ఆందోళనలను చేయడం లేదని ప్రశ్నించారు. హైడ్రా పేరిట హైడ్రామా చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. హైడ్రా పేరిట బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలోని పరిశ్రమలతో పాటు సినీ ఇండస్ట్రీని ఆంధ్రాకు తరలించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పేదలకు నోటీసులు ఇవ్వకుండా గుడిసెలను బుల్డోజర్లతో కూల్చివేయించడం విచారకరమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రొకండ్ల రమేశ్, అజయ్, మెట్టు ప్రహ్లాద్, రాజు, శివ, జగదీశ్, పరమేశ్వర్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న పొచ్చర జలపాతం

జోరు వాన

- ఉప్పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో చేరిన వరదనీరు
- కుంటాల, పొచ్చర జలపాతాలకు జలకళ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో ఉరుములు మెరుపులతో కురిసిన వర్షం ప్రజలను భయాందోళనకు గురిచేసింది. శనివారం రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమైన వాన ఆదివారం వేకువజాము వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కాగా డ్రైయినేజీలు పొంగిపొర్లాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, ప్రాజెక్టుల్లో భారీగా వరదనీరు వచ్చి చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. ప్రాజెక్టులు నిండు కుండల్లా తలపించడంతో గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలారు. గాలి బీభత్సంతో రోడ్డు పక్కన ఉన్న చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోగా మరికొన్ని చోట్ల విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. దీంతో రాత్రి 2 గంటల వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జోరు వానలో సైతం ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ప్రాజెక్టులకు జలకళ..

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టుల నీటి సామర్థ్యం పెరగడంతో అధికారులు ఆయా ప్రాజెక్టుల గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. తాంసి మండలంలోని మత్తడివాగు ప్రాజెక్ట్ మూడు గేట్లు, జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్ ఒక గేటును ఎత్తి వరద నీటిని కిందికి వదులుతున్నారు. దీంతోపాటు జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్, మహారాష్ట్రలోని దిగ్రస్‌ను కలిపే అంతర్రాష్ట్ర వంతెనపై పెన్‌గంగ నది ఉధృతి కారణంగా వర్షపు నీరు పైనుంచి ప్రవహిస్తోంది. డొల్లార సమీపంలోని పెన్‌గంగ వంతెనను ఆనుకుని అడుగు దూరంలో ప్రవహిస్తోంది. బేల మండలంలోని మణియార్‌పూర్, సాంగిడి గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భీంపూర్ మండలంలోని నిపాని, అంతర్గాం, పిప్పల్‌కోటి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బోథ్ మండలంలోని పొచ్చర జలపాతానికి వరద ఉధృతి పెరిగి ఉప్పొంగి ప్రవహిస్తోంది. నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం జలకళను సంతరించుకుంది. బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువల్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్‌రూంలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో టి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటల పాటు సేవలు అందించేలా ప్రత్యేక నంబర్లను కేటాయించడంతో పాటు సిబ్బందిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే 9010414723, 7981365932, 9491106893, 9440063624, 7989405310 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)
భీంపూర్	7.8
జైనథ్	9.3
బేల	5.8
గాదిగూడ	10.1
నార్నూర్	10.8
ఇంద్రవెల్లి	10.9
గుడిహత్నూర్	7.9
ఆదిలాబాద్‌రూరల్	7.1
ఆదిలాబాద్‌అర్బన్	8.9
మావల	8.0
తాంసి	8.2
తలమడుగు	8.6
బజార్‌హత్నూర్	9.1
బోథ్	7.6
నేరడిగొండ	8.8
ఇచ్చోడ	12.2
సిరికొండ	11.5
ఉట్నూర్	7.9

పెన్‌గంగకు భారీ వరద

జైనథ్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ ఉధృతి పెరగడంతో ఆనంద్‌పూర్ బ్రిడ్జి మీదుగా ప్రవహించింది. మహారాష్ట్రలోని దిగ్రస్, తెలంగాణలోని ఆనంద్‌పూర్ గ్రామాలను కలుపుతూ నిర్మించిన ఈ బ్రిడ్జి నీట మునగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సాంగ్వి, పెండల్‌వాడ, ఆనంద్‌పూర్ గ్రామాల్లో బ్యాక్‌వాటర్ చేరడంతో దాదాపు 300 ఎకరాల్లో సోయా, పత్తి పంటలు నీటమునిగాయి. నది ఒడ్డున ఉన్న సాంగ్వి గ్రామంలోకి నీళ్లు చేరడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

మహారాష్ట్ర అధికారుల హెచ్చరిక

తాంసి: పెన్‌గంగ నదికి ఎగువన మహారాష్ట్రలో ఉన్న ఇసాపూర్ డ్యామ్‌లో నీటి ప్రవాహం పెరుగుతుండడంతో గేట్లను ఎత్తి నీటిని వదిలే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిక జారీ చేశారు. కావున పెన్‌గంగ దిగువన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రకటన జారీచేశారు. గ్రామాల్లో డప్పుచాటింపు వేయించి అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

రాకపోకలకు అంతరాయం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందుగానే ప్రకటించింది. అందుకు అనుగుణంగా శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో ప్రారంభమైన వర్షం చిలికి చిలికి గాలివానలా మారింది. ఆకాశానికి చిల్లు పడిందా? అన్నట్లు శనివారం రాత్రి 8 నుంచి వేకువజామున 5 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో జిల్లాలోని పలు గ్రామాల్లోని లోలెవల్ వంతెనలపై వర్షపు నీరు పొంగి ప్రవహించింది. దీంతో వాటిని ఆనుకుని ఉన్న గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ముఖ్యంగా పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లోని జైనథ్, బేల మండలాల్లోని వివిధ గ్రామాలకు వర్షపు నీరు వచ్చి చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వర్షపు నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. వాగులు, వంకలను ఆనుకుని ఉన్న పంట చేలల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో పంటలకు నష్టం చేకూరే అవకాశం ఉంది.



తలమడుగు మండల కేంద్రంలో పొంగిపొర్లుతున్న వాగు



తాంసి: పంటచేనులో నిలిచిన వరద నీరు



తాంసి: కరంజ(టి) శివారులో వరద ప్రవాహానికి దెబ్బతిన్న పత్తి పంట



తలమడుగు: సుంకిడి సమీపంలో ఉప్పొంగిన వాగు

సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న ఎస్‌ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ మాట్లాడుతూ జిల్లాలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పలు ఫీడర్లు ట్రిప్ అయ్యాయని, వర్షం తగ్గిన తర్వాత వాటిని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. 33కేవీ బ్రేక్‌డౌన్ కావడంతో అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేశామన్నారు. బేల ఫీడర్‌లో పలు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని, మూడు సబ్‌స్టేషన్లలో ఇన్సులేటర్ పేలిపోవడంతో వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈలు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధార్థ

ఎదులాపురం: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ దళిత సమన్యాయం పాదయాత్ర చేపట్టనున్నట్లు దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభం కానున్న ఈ పాదయాత్ర 40 రోజుల పాటు కొనసాగి గద్వాల జిల్లా అలంపూర్‌లో ముగుస్తుందన్నారు. 70 ఏళ్లుగా దేశంలో ఎస్సీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ ఫలాలు కేవలం మూడు శాతం మందికే దక్కాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలనే ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు నందు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన, ర్యాలీ
- జేఏసీ ఆధ్వర్యంలో విద్రోహ దినం

ఆదిలాబాద్‌టౌన్: సీపీఎస్ విధానం వద్దని, భేషరతుగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ జేఏసీ నాయకులు నినదించారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సంఘ భవనం నుంచి ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఏసీ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానంతో ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. నూతన పెన్షన్ విధానాలకు మూల కారణమైన పీఎఫ్‌ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలవుతుందని గుర్తు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, టీజీవో, పీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్, ఎస్టీయూ, డీటీఎఫ్, టీటీయూ, టీఆర్‌టీఎఫ్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం, డ్రైవర్ అసోసియేషన్, పెన్షనర్ అసోసియేషన్, టీజీటీటీఎఫ్ సంఘాల నాయకులు శివకుమార్, బాలచందర్, స్వామి, అశోక్, శ్రీనివాస్, అశోక్, వృకోదర్, సుదర్శన్, శివకుమార్, ఇందిరా, సబ్దార్ అలీ, లక్ష్మారెడ్డి, నరేష్ చౌహాన్, సంతోష్, వెంకట్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆయా సంఘాల ఆధ్వర్యంలో..

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఆయా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఉద్యోగులకు ఇబ్బందులు కలిగే సీపీఎస్ విధాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీటీఎఫ్, పేటా, టీటీయూ, టీపీటీఏ సంఘాల నాయకులు శ్రీకాంత్, జలేందర్‌రెడ్డి, స్వామి, నరేష్ చౌహాన్, రియాజ్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

ఉట్నూర్‌రూరల్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీటీఎఫ్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ డిమాండ్ చేశారు. సీపీఎస్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే అమలు చేసి రావాల్సిన డీఏ, పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సురేష్, గజేందర్, గోకుల్, ఇందల్, ఉత్తం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

డుమ్మా ఉద్యోగులపై నజర్

- విద్యాశాఖ ఉద్యోగులకు ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్
- సమయపాలన పాటించని వారికి చెక్
- గతేడాది విద్యార్థులకు, త్వరలో ఉపాధ్యాయులకు సైతం..

ఆదిలాబాద్‌టౌన్: సమయపాలన పాటించని పంతుళ్లపై ఇదివరకు బయోమెట్రిక్ హాజరు ఏర్పాటు చేసినప్పటికీ కరోనా తర్వాత ఆ యంత్రాలు మూలనపడ్డాయి. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. వారికి నచ్చినప్పుడే బడిబాట పడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్ కొనసాగుతుండగా తాజాగా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ యాప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సమయపాలన పాటించని ఉద్యోగులకు చెక్ పడనుంది. కొంత మంది వారికి నచ్చినప్పుడే రావడం, మరికొంత మంది చెప్పాపెట్టకుండా ఒకట్రెండు రోజుల పాటు విధులకు గైర్హాజరవుతున్నారు. ఇలాంటి వారికి ఈ ఫేస్ రికగ్నేషన్ యాప్‌తో డుమ్మాలకు చెక్ పడనుంది. సమయపాలన పాటించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. త్వరలో ఉపాధ్యాయులకు సైతం ఈ యాప్‌ను అమలులోకి తేనున్నట్లు సమాచారం. మొదట విద్యాశాఖలో అమలు చేసిన తర్వాత ఇతర శాఖ ఉద్యోగులకు కూడా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కానుంది. ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా? గైర్హాజరవుతున్నారా? అనే విషయాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. అలాంటి వారిపై కొరఢా ఝులిపించేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యాశాఖ ఉద్యోగులకు..

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉద్యోగులందరి వివరాలను ఇప్పటికే సేకరించారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ఆఫీస్ సబార్డినేట్ స్థాయి నుంచి ఉన్నతాధికారులకు సైతం ఈ యాప్‌ను అమలులోకి తీసుకొచ్చారు. ఉద్యోగి స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేశారు. అయితే కొంత మంది ఉద్యోగులకు మాత్రం ఆండ్రాయిడ్ మొబైల్ లేకపోవడంతో దీనిపై ఎలా చేయాలనేది ఇంకా స్పష్టత రాలేదు.



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

డీఈవో కార్యాలయంలో 35 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వారికి సైతం అమలు కానుంది. వారం రోజుల క్రితం ఉద్యోగుల సెల్‌ఫోన్లలో టెక్నీషియన్ వచ్చి యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. వారి వివరాలను అందులో అప్‌లోడ్ చేశారు. త్వరలోనే యాప్ అమలులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకసారి లాగిన్ అయిన తర్వాత నిరంతరంగా ఈ యాప్‌ను వినియోగించవచ్చు. ఉద్యోగి కార్యాలయ ఆవరణలోకి వచ్చిన తర్వాత యాప్‌ను ఓపెన్ చేసి ఆప్షన్ నొక్కితే సదరు ఉద్యోగి ఎన్ని గంటలకు కార్యాలయానికి వచ్చారనే విషయం ఆన్‌లైన్ ద్వారా తెలుస్తోంది. దీనికి సంబంధించి పర్యవేక్షణ అధికారి వద్దకు సమాచారం వెళ్తుంది. కార్యాలయం విడిచివెళ్లే సమయంలో క్లాక్ అవుట్ చేస్తే కార్యాలయంలో ఎన్ని గంటల పాటు ఉన్నారో తెలిసిపోతుంది.


కార్యాలయంలోకి వచ్చిన తర్వాతే..

విద్యాశాఖ ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలి. కానీ కొంతమంది సమయపాలన పాటించకపోగా, మరికొంత మంది చెప్పపెట్టకుండానే గైర్హాజరవుతున్నారు. వారు వచ్చిన తర్వాత అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టుకుంటున్నారు. మరికొంత మంది ఆన్‌డ్యూటీ పేరిట విధులకు ఎగనామం పెడుతున్నారు. పర్యవేక్షణ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. మరికొంత మంది ఉద్యోగులు ఆ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారి సొంత పనుల్లో గడుపుతున్నారు. అయితే ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను అమలులోకి తీసుకొచ్చింది. ఈనెల నుంచి అమలులోకి తీసుకురానుంది. ప్రస్తుతం డీఈవో, ఎంఈవో, డిప్యూటీ డీఈవో కార్యాలయంలో అమలు చేయనున్నారు. త్వరలో మిగితా శాఖల్లో, పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి సైతం అమలు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వారికి అనుగుణంగా వాడుకునే ప్రయత్నాలు..

ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో కార్యాలయ ఆవరణలోకి వచ్చిన తర్వాత అటెండెన్స్ పడుతుంది. అయితే కొంత మంది ఉద్యోగులు తమ సొంత పనులను చక్కబెట్టుకునేందుకు ఎప్పటిలాగే వాడుకునే అవకాశం లేకపోలేదు. రిజిస్టర్‌లో సంతకం పెట్టి బయటకు వెళ్లవచ్చు. అలాంటి వారికి యాప్‌ను వాడుకునే అవకాశం సైతం ఉంది. అయితే ఉదయం క్లాక్ ఇన్ అయిన తర్వాత సదరు ఉద్యోగి ఆఫీస్‌ను వదిలిపోయేంత వరకు ఉంటుంది. సాయంత్రం క్లాక్ అవుట్ సమయం వరకు అవకాశం ఉంటుంది. అయితే ఉదయం ఆఫీస్‌కు వచ్చిన తర్వాత నుంచి మధ్యాహ్నం లంచ్ వెళ్లే వరకు, లంచ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత సాయంత్రం వరకు యాప్ పనిచేసే విధంగా రూపొందిస్తే డుమ్మా ఉద్యోగులకు చెక్ పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

యాప్ ఇన్‌స్టాల్ చేశాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉద్యోగుల ఆండ్రాయిడ్ మొబైల్‌లలో ఫేస్ రికగ్నిజేషన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడం జరిగింది. ఆదేశాలు వచ్చిన వెంటనే ఈ యాప్‌ను ప్రారంభిస్తాం. దీంతో ఉద్యోగులు సమయపాలన పాటించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు ఫేస్ రికగ్నేషన్ యాప్ అమలులో ఉంది.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ లెటర్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఎంపిక చేసిన వారికి వెంటనే లెటర్లు ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మొత్కూరి కొమురయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీ ప్రక్రియ చేపట్టి ఎంపికైన వారికి ఇంకా లెటర్లు ఇవ్వకుండా జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే లెటర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బ్లాస్టింగ్ కార్మికుల కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ)ఆధ్వర్యంలో బ్లాస్టింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఓసీపీపై యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బ్లాస్టింగ్ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా అగ్గు కిరణ్, కార్యదర్శిగా ఆకుల నరేశ్, ఉపాధ్యక్షుడిగా పెద్దింటి సుధాకర్, సహాయ కార్యదర్శిగా బండారి బండారి సత్తయ్య, కోశాధికారిగా సుద్దుల శంకర్, కమిటీ సభ్యులుగా తోట సురేశ్, బండారి సురేశ్, ఆకుల సుభాశ్, గొల్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

పిడుగుపాటుకు ముగ్గురికి స్వల్పగాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని సాలేగూడ గ్రామానికి బాన్నే సుజాత, మండబాయి, సావితలు పిడుగుపాటుకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..శనివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుపడగా గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వారిని జిల్లాకేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు.

'కళాశాల అభివృద్ధికి పాటుపడుతా'



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

ఇచ్చోడ: ఇచ్చోడలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పాటుపడుతానని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాశాలలో సౌకర్యాల కల్పన, నాన్ టీచింగ్ నియామకం, నూతన భవన నిర్మాణం కోసం కృషిచేస్తానన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కట్కం మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కట్ల వేణు, మహేష్, నిర్మల్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌రావ్, దయాకర్, ఉట్నూర్ ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, లెక్చరర్లు సరిత, రాణి, తిరుపతి, ప్రభాత్ రావు, విజయ్ పాల్గొన్నారు.

కాలినడకన హజ్‌యాత్రకు..

వాంకిడి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన మహమ్మద్ అబ్దుల్ అబిద్ కాలినడకన హజ్‌యాత్రకు బయల్దేరాడు. ఆదివారం వాంకిడి చేరుకోగా, ముస్లిం పెద్దలు, యువకులు స్వాగతం పలికారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం మైనార్టీ సభ్యులు అబిద్‌తో కలిసి మహారాష్ట్ర సరిహద్దు గోయేగాం వరకు కాలినడకన వెళ్లి వదిలారు.

నిండుకుండలు..



మహారాష్ట్రతోపాటు ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులను పరిశీలించి.. పలు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీన్ని వీక్షించేందుకు పలువురు రావడంతో ప్రాజెక్టుల వద్ద సందడి నెలకొంది.

కడెంకు పోటెత్తిన వరద



కడెం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కడెం ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అప్రమత్తమైన అధికారులు పది వరద గేట్లు ఎత్తి 79,850 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఐదు వరద గేట్ల ద్వారా 18,381 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 694.675(6.285టీఎంసీ) అడుగులు ఉంది. అధికారులు ప్రాజెక్ట్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



'స్వర్ణ'నాలుగు గేట్లు ఎత్తివేత



సారంగాపూర్: మండలంతోపాటు మహారాష్ట్రలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. అధికారులు ఆదివారం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484 టీఎంసీలు) కాగా, 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో 4 గేట్ల ద్వారా 80 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించారు. ఈఈ లక్ష్మి, డీఈ శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరో రెండు రోజులు వర్షసూచన ఉన్న నేపథ్యంలో ప్రజలు స్వర్ణ నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. పశువుల కాపర్లు, మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేఈలు మధుపాల్, దేవేందర్, తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

'మత్తడివాగు'మూడు గేట్లు..



తాంసి: తాంసి, తలమడుగు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం కురిసిన వర్షానికి మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. అధికారులు ఆదివారం మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో ద్వారా 16,660 క్యూసెక్కుల వరద నీరు రాగా, 3 గేట్లు ఎత్తి 17,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటి మట్టం 277.5 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.20 మీటర్ల వద్ద నిల్వ ఉండేలా నీటిని వదిలేస్తున్నట్లు ఇంజినీర్ హరీశ్‌కుమార్ తెలిపారు.

'అడ', 'వట్టి' గేట్లు..



ఆసిఫాబాద్‌రూరల్: అడ ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి 3200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తి స్థాయి నీటిమట్టం 10.393 టీఎంసీలు (243 మీటర్లు) కాగా ప్రస్తుతం 5.809 టీఎంసీలు వాటర్ లెవల్ 237.700 మీటర్లుగా ఉంది. వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 360 క్యూస్కెల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 2.89 టీఎంసీలు (238.50 మీటర్లు) ప్రస్తుతం 2.329 టీఎంసీలు ఉంది. ఇన్ ఫ్లో 750 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో ద్వారా 360 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

గడ్డెన్నవాగుకు వరద



భైంసాటౌన్: గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ప్రాజెక్టులోకి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టానికి(358.40మీ) చేరుకుంది. అధికారులు రెండు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. గంటగంటకు వరదనీటి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు దిగువన ఆటోనగర్ బైపాస్‌రోడ్డు మార్గంలో వంతెన నీట మునగగా, ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపేశారు.

'కుంటాల'కు జలకళ



నేరడిగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కుంటాల జలపాతానికి వరద నీరు పోటెత్తింది. దీంతో జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఇక్కడి అందాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రకృతి సహజ సిద్ధమైన పచ్చని అడవి తల్లి ఒడిలో సెలయేళ్ల పరవళ్లు తొక్కుతున్న జలధారాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జాలువారే అందాలను చూసి వారు మంత్రముగ్ధులవుతున్నారు. జలపాతం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

సాత్నాల గేటు..



జైనథ్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాత్నాలలోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో అధికారులు ఆదివారం మొదటి గేటును ఎత్తారు. రెండవ గేటును 0.1 మీటర్ల ఎత్తులో ఎత్తి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీళ్లను వదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 1.24 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 285.70మీటర్ల ఎత్తులో 1.056టీఎంసీ నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు సమాచారం.

అనాథలుగా ఇద్దరు పిల్లలు

- రెండు నెలల క్రితం తల్లి ఆత్మహత్య
- శనివారం మూర్ఛవ్యాధితో తండ్రి మృతి
- సిరికొండలో ఘటన

సిరికొండ: రెండు నెలల క్రితం తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, తండ్రి మూర్ఛ వ్యాధితో శనివారం మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సిరికొండ గ్రామ పంచాయతీలో దాసరి శ్రీనివాస్ మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో రెండు నెలల క్రితం భార్య దాసరి రజిత ఆత్మహత్య చేసుకుంది. శ్రీనివాస్ తన ఇద్దరు పిల్లలు మేఘన(13), రిషి(12)ను చూసుకుంటున్నారు. వారిని నానమ్మ ఆడేల్ల వద్ద ఉంటున్నారు. కాగా, సిరికొండకు చెందిన ముత్యాపు లాస్య శుక్రవారం మృతి చెందింది. శనివారం అంత్యక్రియలకు



అనాథలు అయిన పిల్లలు

కట్టెల కోసం గ్రామస్తులతో కలిసి శ్రీనివాస్ అడవికి వెళ్లాడు. అక్కడే మూర్ఛ వచ్చి మృతి చెందాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. పిల్లల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. శ్రీనివాస్ తల్లి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.

హత్యకు దారితీసిన గొడవ

- టీవీ చానల్ మార్పు విషయమై..
- కొత్తపల్లి–హెచ్ కొలాంగూడలో ఘటన



లక్ష్మణ్ (ఫైల్)

నార్నూర్: టీవీ చానల్ మార్పు విషయమై జరిగిన గొడవ ఒకరి హత్యకు దారితీసింది. మండలంలోని కొత్తపల్లి–హెచ్ కొలాంగూడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ రహీంపాషా కథనం ప్రకారం..గ్రామానికి చెందిన సిడాం మంతుబాయి–లక్ష్మణ్ దంపతులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మాడవి రాముతో కలిసి లక్ష్మణ్(35) కొడప జైతు ఇంట్లో టీవీ చూడటానికి వెళ్లారు. టీవీ చూస్తుండగా చానల్ మార్పు విషయంపై ఇద్దరికి గొడవ జరిగింది. ఆ సమయంలో జైతు లేకపోవడంతో గొడవ పెరిగింది. గమనించిన మంతుబాయి తన భర్త లక్ష్మణ్‌ని ఇంటికి తీసుకెళ్తుంది. వెనుక నుంచి వచ్చిన రాము.. లక్ష్మణ్‌పై దాడి చేసి ఆయర ఛాతీపై కూర్చొని పిడికిలతో గుద్ది, గొంతునొక్కడంతో స్పృహ కోల్పోయాడు. మంతుబాయి అరుపులు విన్న స్థానికుడు సిడం భుజంగరావు అక్కడికి వస్తుండగా రాము పారిపోయాడు. గ్రామస్తుల సాయంతో లక్ష్మణ్‌ను ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడలో కోడి పందేల స్థావరంపై నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగతా 11 మంది పరారయ్యారు. ఘటన స్థలం వద్ద 3 కోడిపుంజులు, మూడు కత్తులు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడిన ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడ కు చెందిన అందె సురేశ్ కిరాణా షాపులో గత నెల 26న చోరీ చేసిన షేక్ అయాన్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపా రు. గణేశ్‌మందిర్ ఎదుట ఆదివారం వాహనా లు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి అయాన్‌ను విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించారు. ఆయనతోపాటు మరో వ్యక్తి చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రేతను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపా రు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన షేక్ కలీమ్ ఆదివారం సుందరయ్యనగర్‌లోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ప్లాస్టిక్ కవర్‌లో 510 గ్రాముల గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఎస్సై విష్ణుప్రకాశ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా గంజాయి లభించింది. గంజాయితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈయన వారం క్రితం మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన హనుమాన్ నుంచి కిలో గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి



గణేశ్ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన టేకం గణేశ్ (35) శనివారం ఉదయం పశువుల మేతకు వెళ్లాడు. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గ్రామ సమీపంలో ఒర్రెలో నీటి ప్రవాహం ఎక్కువ ఉంది. కాసేపు అక్కడే ఉన్న తర్వాత ఒర్రె దాటుతుండగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు రాత్రి గాలించిన ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటికి తీశారు. తండ్రి భీము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

వాగులో పడిన ఐచర్ వాహనం

- ఈత రావడంతో నలుగురు కూలీలు, ఒక డ్రైవర్ సురక్షితం
- తాడు సాయంతో బయటకు..

నిర్మల్‌రూరల్: అతివేగంగా వస్తున్న ఐచర్ వాహనం అదుపుతప్పి వాగులో పడింది. ఆదివారం సాయంత్రం నిర్మల్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సాయికుమార్, స్థానికులు తెలిపిన వివరాలు.. ఖానాపూర్‌కు చెందిన చాంద్‌పాషా స్థానికంగా ఐచర్ డీసీఎం ఓనర్ కమ్ డ్రైవర్‌గా వాహనం నడిపిస్తుంటాడు. ఆదివారం నలుగురు కూలీలను వెంటబెట్టుకుని ఖానాపూర్ నుంచి భైంసాకు లోడ్‌తో వెళ్లాడు. తిరిగివస్తుండగా వాహనం అదుపుతప్పి మండలంలోని చిట్యాల వద్ద బ్రిడ్జిని ఢీకొంది. పైనుంచి వాగులో పడిపోయింది.

ప్రాణాలు కాపాడిన ఈత

వాహనం వాగులో పడడంతో స్థానికులు గమనించారు. అందులో నలుగురు కూలీలు షాకీబ్, హైదర్, ఎస్ డి.సమీర్, అయాబు, డ్రైవర్ చాందపాషాలకు ఈత రావడంతో స్థానికులు తాడు సహాయంతో బయటకు వచ్చారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారిని నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వారికి ఈత రావడంతో ప్రాణాలు కాపాడుకున్నారు. భారీ వర్షాలకు స్వర్ణ వాగు పొంగడంతో వాహనం నీటిలో మునిగిపోయింది. రాత్రి వరకు రూరల్ పోలీసులు, అధికారులు వాహనాన్ని బయటకు తీయడానికి ప్రయత్నించారు.

సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఆదివారం రాత్రి గిరిజన సూపర్ మార్కెట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, పిడుగుపాటుకు సీసీ కెమెరాలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పి వేశారు. ప్రమాదంలో రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్, ఎల్ఎఫ్ ఎంఏ ముబీన్, సిబ్బంది సదానందం, వేణు, ఎం.మధుకర్, విఘ్నేశ్వర్ ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పద్మశాలీలకు అధిక సీట్లు ఇవ్వాలి

- రాష్ట్ర అధ్యక్షుడు మురళి



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు పద్మశాలీలకు అధిక సీట్లు ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సంఘ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేతన్న బీమాకు రూ.6 కోట్లు, బతుకమ్మ చీరల బకాయిలు రూ.150 కోట్లు, చేనేత సహకార సంఘాల బకాయిలు రూ. 25 కోట్లతోపాటు ఎల్ఐసీ నిబంధనల ప్రకారం నేతన్న బీమా వర్తించని కార్మికులకు ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. నిధుల విడుదల చేయించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హ్యాండ్లూమ్ కమిషనర్ శైలజ రామయ్యర్‌కు చేనేత వర్గాల తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మురళిని సంఘం నాయకులు సన్మానించారు. గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, కోశాధికారి రఘురాం నేత, రాష్ట్ర ఉపాధ్యక్షులు బేత రమేశ్, జక్కుల సత్యనారాయణ, తాలుకా పద్మశాలి సంఘం డివిజన్ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి చిలక విలాస్, నాయకులు కామన్ విఠల్, మోర ఆశన్న, బుర్ల శంకరయ్య, దాసరి రమేష్, దాసరి ఆశన్న, మోర కిష్టన్న, గాజుల హనుమాన్లు, అనుముల ఊషన్న, వీరన్న, అన్నం నందు కుమార్, రమేశ్, నరేందర్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్తారింటి వేధింపులు తాళలేక జైపూర్ మండలం కుందారం చెందిన వివాహిత పురుగుల మందు తాగింది. కడుపునొప్పి బాధ భరించలేక చెన్నూర్‌లో వివాహిత, అప్పుల బాధతో ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంటకు చెందిన ఒకరు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. బెజ్జూర్ మండలం సిద్దాపూర్‌కు చెందిన ఒకరు మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉరేసుకుని వివాహిత..



మంజుల మృతదేహం

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడకు చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాలు.. భీమారం మండలం కాజిపల్లికి చెందిన మంజుల (35), చెన్నూర్‌కు చెందిన కడవండి మహేశ్‌ను ప్రేమించి గత 17 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి ముగ్గురు కుమారులు. మహేశ్ తాపీమేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెళ్లినాటి నుంచి తల్లిదండ్రులతో సంబంధాలు లేవు. కాగా, గత రెండేళ్లుగా మంజల కడుపునొప్పితో బాధపడుతుంది. ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది.

వేధింపులతోనే..

నా బిడ్డ కడుపు నొప్పితో మృతి చెందలేదని, భర్త మహేశ్ వేధింపులతోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి గోదారి లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

అత్తారింటి వేధింపులకు వివాహిత..



శరణ్య(ఫైల్)

జైపూర్: వరకట్నం తేవాలని అత్తారింటి వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన దాసరి శరణ్య(19) కుందారం గ్రామానికి చెందిన దాసరి సతీశ్, శరణ్యలది ఎదురెదు ఇళ్లు. వీరిది ఒకే కులం కావడం, ఒకరికొకరు ఇష్టపడ్డారు. గతేడాది మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆరు నెలలు గడవముందే ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కట్నం కోసం సతీశ్ కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసేవారు. మనస్తాపం చెందిన శరణ్య గతనెల 25న పురుగుల మందు తాగింది. మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, శరణ్య పురుగుల మందు తాగక ముందు రెండ్రోజుల క్రితం సతీశ్ ఆత్మహత్యకు యత్నించాడు. కరీనంగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బెజ్జూర్: మండలంలోని సిద్దాపూర్‌కు చెందిన టాకిరే వసంత్ (48) శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. భార్య నిర్మల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

ఇంద్రవెల్లి: అప్పుల బాధ భరించలేక ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన కేంద్రే దత్త(41) డ్రైవర్‌గా పని చేసి కుటుంబాన్ని పోసిస్తున్నాడు. గతేడాది ఇంటి అవసరం కోసం మండలకేంద్రానికి చెందిన కేంద్రే శివాజీ వద్ద రూ.6 లక్షలు, గోర్పనే దీప నుంచి రూ.50 వేలు, ఆదిలాబాద్ మండలంలోని చిచ్‌ధరిఖానాపూర్‌కు చెందిన పవార్ ప్రకాశ్ వద్ద నుంచి రూ.3.50 లక్షల అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని వారు ఇంటికి వచ్చి బెదిరించేవారు. డబ్బులు ఇవ్వకుంటే ఉరేసుకుని చనిపో అంటూ హింసించేవారు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో దత్త ఉరేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని కుటుంబీకులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఆశాతాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు అనికేత్, కావేరి ఉన్నారు.